ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 4 మార్చి 2025







గుంటూరు ఏసీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

పట్టభద్రుల పోరులో.. కూటమి దూకుడు

- ఒక్కో రౌండ్‌లో సగటున 10 వేలకు పైగా ఓట్ల ఆధిక్యం
- ఐదో రౌండ్ ముగిసేసరికే 47,872 ఓట్ల ఆధిక్యంలో ఆలపాటి
- ఓట్ల లెక్కింపులో తేలిపోయిన పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు(తెలుగుదేశం) ఘన విజయం దిశగా దూసుకుపోతున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఈ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. స్ట్రాంగ్ రూంల సీళ్లను అభ్యర్థులు, ఏజంట్ల సమక్షంలో తెరిచి బ్యాలెట్ బాక్సులను భద్రంగా కౌంటింగ్ హాల్‌లోకి చేర్చారు. అనంతరం ఏజంట్ల సమక్షంలో సీళ్లు తెరిచి బ్యాలెట్ పేపర్లను మిశ్రమం చేశారు. ఆ తర్వాత 50 చొప్పున కట్టలు కట్టారు. ఆర్వో టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా తెరిచారు. మొత్తం 371 పోస్టల్ బ్యాలెట్లకు 55 చెల్లుబాటు కాలేదు. దాంతో 316 బ్యాలెట్లను తొలి రౌండ్ కౌంటింగ్‌లోకి తీసుకొచ్చారు. మొత్తం పోలింగ్ అయిన 2,41,493 ఓట్లను 50 చొప్పున 4,828 బండిల్స్(కట్టలు)గా చేశారు. మిగిలిన 93 ఓట్లతో మరో కట్ట కట్టారు. కౌంటింగ్ హాల్‌లో 28 టేబుల్స్ ఏర్పాటు చేసి ఒక్కో టేబుల్‌పైకి ఒక్కో రౌండ్‌లో 1000 ఓట్లను లెక్కింపునకు పంపారు.



కౌంటింగ్ సిబ్బంది ఒక్కో కట్ట తెరిచి బ్యాలెట్ పేపర్‌ని ఏజంట్లకు చూపిస్తూ చెల్లుబాటు కాకపోతే ప్రత్యేకంగా ట్రేలో పడేసి చెల్లుబాటు అయిన తొలి ప్రాధాన్య ఓట్లను అభ్యర్థుల వారీగా వారికి కేటాయించిన ట్రేలలో అమర్చారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.29 (మంగళవారం)
సహరి : 5.10 (బుధవారం)

తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం

ఆలపాటి రాజేంద్రప్రసాదుకు తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం లభించింది. అన్ని టేబుళ్లపైనా ఆయనకు మెజార్టీ వచ్చింది. దాంతో తొలి రౌండ్‌లో 17,194 ఓట్లు ఆలపాటికి రాగా లక్ష్మణరావుకు 7214 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు 3070గా ఉన్నాయి. తొలి రౌండ్‌లో 28,312 ఓట్లు లెక్కించారు. రెండో రౌండ్‌లో ఆలపాటికి 17527 ఓట్లు, లక్ష్మణరావుకు 6742 ఓట్లు వచ్చాయి. ఈ రౌండ్‌లోనూ చెల్లని ఓట్లు 3005 ఉన్నాయి. దీంతో ఆలపాటి మెజార్టీ 20765కు చేరుకొన్నది. మూడో

(మిగతా 7వ పేజీలో)

ధ్రువీకరణ పత్రం నకిలీ సిత్రం



అదొక ధ్రువపత్రం మాత్రమే. దానినే ప్రభుత్వ పట్టాగా చలామణి చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు భూములలో పాగా వేసేశారు. అది ఇంతటితో ఆగకుండా జగనన్న కాలనీల కోసం కేటాయించిన స్థలాలనే కబ్జా చేసేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఒక్క సెంటు మాత్రమే జాగా ఇస్తే, వీరు ఈ పత్రాలతో ఏకంగా రెండు సెంట్ల చొప్పున సొంతం చేసుకున్నారు. తెనాలిలో ఆలస్యంగా బయటపడిన నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం రెవెన్యూ శాఖను ఉలిక్కిపడేలా చేసింది. ఇదే తరహాలో ఒక మురా భూమికి విలువ ఎక్కువగా ఉన్న పట్టణాలు, రాజధాని ప్రాంతాల్లో ఈ తరహా నకిలీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ భూముల్లో పాగా వేస్తే, అది ఎంత విస్తీర్ణం? ఎంతమంది అక్రమార్కులు దీని వెనుక దాగున్నారనేది అంతు బట్టని విషయం. పట్టా లేకున్నా కనీసం ఏదో ఒక అధికారిక ధ్రువ పత్రం ఉంది కదా! అని సరిపెట్టుకుందామంటే, అదికూడా అసలు కాదు... అచ్చుగుద్దినట్టు అసలుకు నకిలీని దింపేశారు. ఇక్కడ వీరు చేసిన తప్పేంటంటే!... ప్రతి ప్రభుత్వ ఉత్తర్వులకు కానీ, ధ్రువపత్రాలకు కానీ సంబంధిత రికార్డు నంబర్ ఉంటుంది. ఆ ఒక్క విషయాన్ని మర్చిపోయి ఏ నంబర్ కానీ కనీసం తేదీ కూడా లేకుండా తయారు చేయటమే. అదే ఈ నకిలీ పత్రాల కుంభ'కోణాన్ని' గుర్తించటానికి ఆధారమయింది. పైగా ఈ ధ్రువపత్రంలో గౌరవ శాసనసభ్యునికి అర్జీ పెట్టుకున్నారని, అందుకే స్థలాన్ని కేటాయించినట్టు పేర్కొనటం కూడా నకిలీ గుట్టు రట్టు చేసింది. అధికారానికో! లేక డబ్బుకో తలూపే అధికారులుంటే చిత్తుకాగితం కూడా హక్కు పత్రమైపోతుందనటానికిదో ఉదాహరణ. దీని ఆధారంగా ప్రభుత్వ భూములను సొంతం చేసుకోవటం కొసమెరుపైతే, వాటిలో పాగా వేసిన వారి గురించి రెవెన్యూ శాఖ అసలు పట్టించుకోకపోవటం మరో విశేషం. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవహారం బయటకు పొక్కటంతో దీని మూలాలను ఛేదించే పనిలో పడ్డారు.

- దొంగ పత్రాలతో ప్రభుత్వ భూమి హాంఫట్!
- అవే అధికారిక పట్టాలుగా భూ ఆక్రమణ
- గత ప్రభుత్వ కాలంలో గుట్టుచప్పుడు కాకుండా భూ దందా
- ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా వెలుగులోకి
- ఏ స్థాయిలో ఉందనేది విచారణలో తేలాల్సిందే
- పోలీస్ కేసు పెట్టే ఆలోచనలో రెవెన్యూ అధికారులు !



పట్టా అంటూ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చేసి, స్థలాలను అప్పనంగా దోచేసిన అక్రమార్కులు

తెనాలి, మార్చి 03, (ఆంధ్రజ్యోతి): ఒక చిత్తు కాగితం ఇక్కడ అధికారిక ధ్రువపత్రం అయిపోయింది. దీని ఆధారంగానే ప్రభుత్వ భూములను, జగనన్న కాలనీల్లోని స్థలాలను అధికారులు కట్టబెట్టారో! లేక అక్రమార్కులే దోచేశారో కానీ కబ్జాల పర్వం మాత్రం యథేచ్ఛగా సాగిపోయింది. సాధారణంగా ఒక ప్రభుత్వ భూమిని వ్యక్తులకు కానీ, లేక ప్రైవేటు సంస్థలకు కానీ కేటాయించాలంటే 2012లో విడుదల చేసిన జీఓ నంబర్ 571 ప్రకారం తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలి. ఇదంతా తహసీల్దార్, సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదన పంపాలి. చిన్నపాటి స్థలాలు కాకుండా రూ. 50 లక్షల విలువకు మించిన భూమి అయితే దానికి క్యాబినెట్ అనుమతి ఉండాలి. అయితే తెనాలిలో అవేమీ లేకుండా కేవలం ఒక ధ్రువీకరణ పత్రం పేరుతో స్థలాల హద్దులు చూపించిమరీ అప్పనంగా అప్పగించేశారు. ఇంతటి పక్కా హద్దులతో స్థలాలు కేటాయించారంటే, దీని వెనుక రెవెన్యూ శాఖలోని ఉద్యోగుల పాత్ర ఎంతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. తెనాలిలో గత తహసీల్దార్‌ల కాలంలో జరిగాయా! లేక తహసీల్దార్‌ల బదిలీ జరిగిన

(మిగతా 7వ పేజీలో)



బల్లికురవ ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనుల మస్టర్లపై విచారణ జరుపుతున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారుల బృందం

బోగస్ మస్టర్లపై విచారణ


గ్రామ సహాయకులతో మాట్లాడిన విజిలెన్స్ అధికారులు

ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందన

బల్లికురవ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వలస కూలీలకు ఇబ్బందులు లేకుండా గ్రామాలలోనే కట్టుదిట్టంగా ప్రతి కూలీకి పని కల్పించేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఉపాధి హామీ పథకం చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీహర్ష తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఉపాధి హామీ పనులలో బోగస్ మస్టర్లు వేసేందుకు అధికారులు గ్రామాల క్షేత్ర సహాయకులపై ఒత్తిడి తెస్తున్నారని వచ్చిన వరుస కథనాల మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారుల బృందం మండలంలో విచారణ చేపట్టారు. సంతమాగులూరు మండలంలో విచారణ జరిపింది. అనంతరం బల్లికురవ ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాలకు చెందిన క్షేత్ర సహాయకులను విడి విడిగా విచారణ జరిపారు. ఎవరైనా మస్టరు వేయాలని అడుగుతున్నారా, సిబ్బంది ఒత్తిడి ఏమైనా ఉందా అన్న వివరాలను వారు సేకరించారు. పనులలో లోపాలు ఏవైనా జరుగుతున్నాయా అని వారు ప్రశ్నించారు. అలానే ఆడిట్‌లు ఎలా జరుగుతున్నాయని వారు ఆరా తీశారు. తాము కొత్తగా విధుల్లోకి వచ్చామని కొందరు క్షేత్ర సహాయకులు వారికి తెలిపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పనులలో అవకతవకలు లేకుండా కూలీలకు ఫొటోలు తీసే ప్రక్రియ ఉందని ఎక్కడైన లోపాలు ఉంటే కూలీలు ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేయాలన్నారు. తాము తరచూ పనులను పరిశీలిస్తామని, ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు పత్రికలలో వార్తలు వస్తే విచారణ చేసి కూలీలకు న్యాయం చేస్తామని వారు తెలిపారు. ఈ విచారణలో రాష్ట్ర విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ డీఈ శాంతారావు పాల్గొన్నారు.

'ఫాం7' దొంగలపై సిట్ అస్త్రం

- పర్చూరు నియోజకవర్గంలో ఓట్ల అవకతవకలపై ప్రభుత్వం కన్నెర్ర
- ఎమ్మెల్యే ఏలూరి ఫిర్యాదుతో సిట్ ఏర్పాటు
- ప్రకాశం జిల్లా ఎస్పీ సారథ్యంలో విచారణ



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు పర్చూరు నియోజకవర్గం వేదికగా పెద్ద ఎత్తున ఫాం-7 కుట్రలకు తెరలేపిన సంగతి తెలిసిందే. ఏకంగా పోలీసు శాఖను వాడుకునే ఈ తతంగం అంతా నడిపించింది. బతికుండగానే వేల మంది టీడీపీ అనుకూల ఓటర్లను చనిపోయినట్లుగా ఫాం-7లు దరఖాస్తు చేయించింది. ఈ అక్రమాలపై అప్పుడు కూడా పర్చూరు నుంచే ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఏలూరి సాంబశివరావు గోడు అరణ్య రోదనే అయింది. పదేపదే అప్పటి వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫాం-7 దొంగలకే కొమ్ము కాసింది. ఆ తర్వాత మొక్కుబడిగా కొన్ని కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంది. పర్చూరు నియోజకవర్గంలో దాదాపు 195 మంది వైసీపీ మద్దతుదారులు ఫాం-7లను గంపగుత్తగా దరఖాస్తు చేసి 24,000 ఓట్లను తొలగించడంలో సఫలీకృత మయ్యారు. కేవలం 12 మందిపై మాత్రమే కేసుల ను అప్పటి ప్రభుత్వం నమోదు చేసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ ఓట్ల తొలగింపు భాగోతంపై విచారణ జరపాలని అప్పట్లోనే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ముందు తన సచ్ఛీలత నిరూపించుకునేందుకే మొక్కుబడిగా ఆ 12 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని అప్పట్లో బలమైన విమర్శలు వచ్చాయి. నిబంధలనను ఉల్లంఘించి ఫాం-7 దొంగలకు సహకరించిన నలుగురు పోలీస్ అధికారులపైనా ఈసీ చర్యలు తీసుకుంది. బీఎల్‌వోలుగా విధులు నిర్వహించిన మహిళా పోలీసులు కూడా ఈ ఓట్ల తొలగింపుపర్వంలో భాగస్వాములయ్యారు.

యథేచ్ఛగా కొనసాగిన ఈ తొలగింపుపర్వంపై అప్పట్లో టీడీపీ నేతలు చేసిన పోరాటం పట్టించుకోకుండా, ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యంగా వైసీపీ వేధింపులకు తెరతీసింది. అప్పట్లో పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ పూర్తిగా అధికారం అండతో ఎలాగైనా పర్చూరులో నెగ్గాలనే ఉద్దేశంతో ఈ ఓట్ల తొలగింపులో కర్త, కర్మ, క్రియ అన్నీ తానై వ్యవహరించారు. ఈ లోపు ఎన్నికలు రావడం, టీడీపీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. పర్చూరు నియోజకవర్గంలో 24,000 ఓట్లు తొలగించినా సరే దాదాపు 23,000 మెజార్టీతో తిరిగి ఏలూరి సాంబశివరావు గెలవడంతో కంగు తినడం వైసీపీ వంతైంది.

ఓట్ల దొంగలపై విచారణ జరపడానికి సిట్ వేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. దాని ఆధారంగా ప్రభుత్వం ఓట్ల తొలగింపు అవకతవకలపై విచారణ జరిపేందుకు సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం)ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది

ప్రకాశం జిల్లా ఎస్పీ సారథ్యంలో....

ప్రభుత్వం నియమించిన సిట్ బృందానికి ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్. దామోదర్‌ను హెడ్‌గా, వెస్ట్ గుంటూరు డీఎస్పీ అరవింద్‌ను సభ్యుడిగా నియమించింది. ఈ బృందం సీఐడీ డీజీపీ నియంత్రణలో పనిచేయనుంది. డీజీపీ కోరిక మేరకు మరో అధికారిని సభ్యుడిగా నియమించుకునే వెసులుబాటును ఉత్తర్వులో పేర్కొంటూ ఆదేశాలిచ్చింది

సహాయసహకారాలు అందించాలి...

సిట్ బృందానికి అవసరమైన అన్ని సహాయసహకారాలను అందించాలని బాపట్ల జిల్లా ఎస్పీని ప్రభుత్వం ఆదేశించింది. దర్యాప్తు క్రమాన్ని ప్రతి మూడు నెలల కొకసారి సిట్ బృందం ఈసీకి అందించనుంది. ఈ క్రమంలో అవసరమైన డాక్యుమెంట్లను సీజ్ చేసే అధికారం, సాక్షులను విచారణ చేపట్టడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకునే అధికారాన్ని సిట్‌కు ప్రభుత్వం కట్టబెట్టింది.



చీరాలలోని ఓ పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. పరీక్షలను జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్ పి. యర్రయ్య పర్యవేక్షించారు. రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు,రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షల నిర్వాహణను పరిశీలించారు. జనరల్ విద్యార్థులు 7,845మందికి 7,623 మంది పరీక్షకు హాజరయ్యారు. 222మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 393మందికి 381 మంది హాజరవగా 12 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 8,238కి గాను 8004 మంది హాజరు కాగా 234మంది గైర్హాజరైనట్లు యర్రయ్య తెలిపారు. బందోబస్తును అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. 144వ సెక్షన్ అమలు చేశారు.

తవ్వారు... వదిలేశారు

వేమూరు- చావలి రోడ్డుపై నిత్యం నరకమే..



తవ్వి వదిలేసిన చావలి ఆర్‌అండ్‌బీ రోడ్డు

వేమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మండలం వేమూరు నుండి చావలి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును మూడు మాసాల క్రితం రోడ్డు పునర్నిర్మాణం కోసం తవ్వి వదిలేశారు. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహన చోదకులు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు కిలో మీటర్ల ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ నిధులు రూ.80 లక్షలు మంజూరు అయ్యాయి. టెండర్ ద్వారా కాంట్రాక్టు పిలిచి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి, తర్వాత నిర్మాణ పనిని ప్రారంభించకుండా వదిలేశారు.

దీనిపై ఆర్ అండ్ బీ శాఖ ఏఈ విద్యాసాగర్‌ను వివరణ కోరగా మైనింగ్ శాఖ నుండి కంకర సరఫరా చేయడంలో జాప్యం జరిగిందన్నారు. ప్రభుత్వ పనులకు టోకెన్స్ మంజూరు కావాల్సి ఉందని, వాటి జాప్యం వల్లనే కాంట్రాక్టర్ వెంటనే పనిని ప్రారంభించలేక పోయారన్నారు. నెలాఖరులోగా టోకెన్స్ మంజూరు అయ్యే అవకాశం ఉన్నదని పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు.

జీడీసీసీపై.. ఆర్బీఐ కొరడా

- రూ. 50 వేలు పెనాల్టీ విధింపు
- ఫైన్ పడితే రానున్న రెండేళ్లు బ్యాంకుకు కష్టకాలమే
- 2022-23 బ్యాలెన్స్ షీట్ ప్రచురించటంలో విఫలం

గుంటూరు సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు (జీడీసీసీ) కోలుకోలేని దెబ్బ తగిలింది. బ్యాంకు విధి విధానాలపై ఆర్బీఐ(రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా)కన్నెర్ర చేసింది. రూ. 50 వేలు పెనాల్టీ విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖాతాలు, బ్యాలెన్స్ షీట్‌ను ప్రచురించడంలో బ్యాంక్ విఫలమైనందున ఈ చర్యలకు ఉపక్రమించింది. 2022-23 సంవత్సరాల్లోనే జీడీసీసీ బ్యాంకు వేదికగా రుణాల మంజూరులో అనేక అక్రమాలు జరిగాయి. ఈ నేపథ్యం లోనే బ్యాలెన్స్ షీట్ దాఖలు చేసేందుకు బ్యాంకు అధికారులు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఖాతాల వివరాలు వెల్లడిస్తే నకిలీ భాగోతాలు వెలుగులోకి వస్తాయన్న భయంతోనే గోప్యత పాటించినట్లు అర్థం అవుతుంది. నకిలీ ఆధార్ కార్డులతో, ఈ-కేవైసీతో సంబంధం లేకుండా కోట్ల రూపాయలను వైసీపీ నేతలు కొల్లగొట్టారు. ప్రత్తిపాడుతో పాటు జిల్లాలోని 17 సహకార సంఘాల్లో అక్రమాలు జరిగాయి. మొత్తం రుణ మాఫియాలో 184 మంది రైతులు, 21 మంది జీడీసీసీ మేనేజర్‌లు, అసిస్టెంట్ మేనేజర్‌లు ఉన్నట్లు సహకార శాఖ తేల్చింది. క్షేత్ర స్థాయిలో కనీస పరిశీలన లేకుండానే మేనేజర్, సూపర్‌వైజర్, సీఈఓ అడ్మినిస్ట్రేటివ్ సర్క్యులర్‌కి వ్యతిరేకంగా రుణాలు మంజూరు చేయటంతో అక్రమాలకు తెరలేచింది. ఇదే విషయాన్ని నాబార్డు కూడా తప్పు పట్టింది. గత ఐదేళ్లుగా సాగిన రుణ మాఫియా భాగోతంలో అసలు దోషుల పై చర్యలు తీసుకునేందుకు బ్యాంకు సీఈఓ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రత్తిపాడు బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన 11 మంది నకిలీ రైతులను పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు, ఇతర డాక్యుమెంట్‌లు సృష్టించి రూ. 5 కోట్ల వరకు ఈ బ్రాంచ్ నుంచి కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చారు. కొందరు తహసీల్దార్‌లు,వీఆర్వోలు నిందితులుగా ఉన్నారు. జీడీసీసీ అక్రమాలపై మొత్తం 18 కేసులు నమోదు అయినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. జీడీసీసీ బ్యాంకు కు చెందిన 42 శాఖల్లో నూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నల్లపాడు జీడీసీసీ శాఖలో కూడా రూ. 70 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రాగా, వివాదం ముదురుతున్న తరుణంలో రుణాలు తీసుకున్న వ్యక్తులు కొంత మొత్తం తిరిగి చెల్లించారు.

పెనాల్టీ పడితే అంతే..

ఏ బ్యాంకు అయినా ఆర్బీఐ పెనాల్టీ విధించడం తీవ్రమైన చర్యగా భావిస్తారు. దానివల్ల రానున్న రెండేళ్ల పాటు పెనాల్టీ విధించబడిన బ్యాంకు కు సంబంధించిన అన్ని విషయాల పై ఆర్బీఐ కన్ను వుంటుంది. పెనాల్టీ వేసిన తర్వాత బ్యాంకు కు సంబంధించిన డిపాజిట్లు విత్ డ్రా పై ఆర్బీఐ నియంత్రణ ఉంటుందని చెబుతున్నారు. ఇష్టానుసారంగా డిపాజిట్లు విత్ డ్రా చేయడానికి ఆర్బీఐ ఒప్పుకోక పోగా, పరిమితి కూడా పెడుతుంది. ఆర్బీఐకి సంబంధించిన ఆడిటర్ల చేత పెనాల్టీ విధించిన బ్యాంకు ను తనిఖీ చేయిస్తారని తెలుస్తున్నది. అంత మాత్రమే కాకుండా రెండేళ్ల పాటు అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలపై కూడా ఆర్బీఐ కఠినంగా వ్యవహరిస్తుంది.

సొంత ఖాతా నుంచే ఇంటి అద్దె చెల్లించా!

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ వివరణ

అమరావతి, మార్చి3(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయ భవనానికి రెండేళ్ల తర్వాత ఇతర ప్రభుత్వ విభాగాలు చెల్లించే అద్దెతో సమానంగానే అద్దె సవరించినట్టు రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరి తెలిపారు. భవన యజమాని అటవీ శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని లేదా ఇతర శాఖలతో సమానంగా అద్దె చెల్లించాలని కోరినందున అద్దె పెంచినట్లు వివరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో అడవిలో 'కిమ్' రాజ్యం శీర్షికతో కథనం వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 2016నుంచి తాను రెయిన్ ట్రీ పార్కులో ఉంటుండగా, అదే సొసైటీకి చెందిన ప్రస్తుత ఇంటికి నెలకు రూ.50 వేలు తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నుంచి అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపారు. తన పదవీ కాలంలో ప్రభుత్వ వాహనాలను అధికారిక పనుల కోసమే వినియోగించానని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎప్పుడూ వాడలేదన్నారు. పీసీసీఎఫ్‌గా వాడిన వాహనాలన్నీ పదేళ్ల కంటే పాతవని చెప్పారు. శాఖాపరమైన బదిలీలు, పోస్టింగ్‌ల్లో ఏ ఒక్కరి ప్రమేయం, అవినీతికి ఆస్కారం లేకుండా ఉపముఖ్యమంత్రి మద్దతుతోనే చేసినట్లు తెలిపారు. చాలాకాలంగా ఒకే పోస్టులో ఉన్న వారిని పరిపాలనా కారణాలతో బదిలీ చేయగా, కోర్టు నుంచి అనుకూల ఉత్తర్వులు పొందారన్నారు.

సిబ్బంది కొరత వల్లే రెండు షిఫ్టుల విధానం

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ వివరణ

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జైలులో గార్డింగ్ సిబ్బంది కొరత కారణంగానే రెండు షిఫ్టుల విధానం అమలు చేస్తున్నామని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. జైళ్లశాఖ కోస్తాంధ్ర రీజియన్‌లో ఉన్నతాధికారికి, సిబ్బందికి నడుమ కొనసాగుతున్న వివాదంపై 'జైళ్ల శాఖ.. కోస్తాంధ్రలో కోల్డ్‌వార్' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ తరఫున డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్ వివరణ ఇచ్చారు. జైలులో 220మంది గార్డింగ్ సిబ్బందికి గాను 155మంది మాత్రమే ఉన్నారన్నారు. షడక్ అనే ఓపెన్ జైలు ఖైదీని డీఐజీ కార్యాలయంలో ఏసీ మరమ్మతు నిమిత్తం పంపించామని వివరించారు. ఈ విషయంలో కిందిస్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేయలేదని, శాఖాపరమైన విచారణ కొనసాగుతోందన్నారు.

టెన్త్ హాల్‌టికెట్లు విడుదల

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సోమవారం తెలిపింది. విద్యార్థులు పాఠశాల లాగిన్ ద్వారా లేదా మన మిత్ర వాట్సాప్ నంబరు ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. కాగా ఈ నెల 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

గ్రూప్2 అభ్యర్థులకు హారిజంటల్ రిజర్వేషన్

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 మెయిన్స్ నోటిఫికేషన్‌లో మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్ మెన్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి హారిజంటల్ రిజర్వేషన్ విధానం వర్తిస్తుందని ఏపీపీఎస్సీ సోమవారం ప్రకకటించింది. సాధారణంగా అమలుచేసే వర్టికల్ రిజర్వేషన్‌లో భాగంగానే ఇది కూడా అమలవుతుందని తెలిపింది. హారిజంటల్ రిజర్వేషన్‌లో అర్హులైన మహిళా అభ్యర్థులు లేకపోతే ఆ పోస్టులను ప్రస్తుత నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామంది.

గ్రూప్-2 వెబ్ ఆప్షన్లపై నిరుద్యోగ జేఏసీ హర్షం

విజయవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'గ్రూప్-2 అభ్యర్థుల విన్నపాలను గౌరవించి వెబ్ ఆప్షన్లు పెట్టుకోమని తెలియజేయటం శుభ పరిణామం' అని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్ సోమవారం హర్షం వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్ల ఆలస్యం కారణంగా వేలమంది వయోపరిమితి కోల్పోయారని, వయోపరిమితి పెంచి నోటిఫికేషన్లు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్ అర్హులే

» హైకోర్టు స్పష్టీకరణ

» పిటిషన్ కొట్టివేత.. 25 వేలు ఖర్చులు విధింపు



అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టేందుకు అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అర్హులేనని హైకోర్టు తేల్చిచెప్పింది. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారని పేర్కొంది. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనేందుకు ఈ కేసు మంచి ఉదాహరణ అని తెలిపింది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ పిటిషనర్ రమణమూర్తికి రూ.25వేలు ఖర్చులు విధించింది. ఈ సొమ్మును నాలుగు వారాల్లో ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఫిబ్రవరి 28న తీర్పు ఇచ్చారు. సోమవారం తీర్పు ప్రతి అందుబాటులోకి వచ్చింది. దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అక్రమాలపై రాష్ట్ర విజిలెన్స్ విచారణ పూర్తయ్యేవరకు ఆయనను దేవదాయశాఖలో కొనసాగించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మచిలీపట్నానికి చెందిన వీవీ రమణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుది విచారణ జరిపిన న్యాయమూర్తి నిర్ణయాన్ని వెల్లడించారు. 'దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 3, 4 ప్రకారం అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తి కమిషనర్‌గా నియమితులయ్యేందుకు అర్హులు. చట్టంలోని సెక్షన్ 3(2) ప్రకారం హిందూ మతాన్ని ఆచరించనప్పుడు మాత్రమే కమిషనర్ పోస్టుకు అనర్హులు. వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మన్సాస్ ట్రస్ట్ ఈవోగా అక్రమాలకు పాల్పడ్డారంటూ త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రామచంద్రమోహన్‌ను గతంలో సస్పెండ్ చేశారని, హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు పొందడం ద్వారా తిరిగి విధుల్లో చేరారని పిటిషనర్ రమణమూర్తి వ్యాజ్యంలో పేర్కొన్నారు. 'ఇన్‌చార్జి కమిషనర్‌గా రామచంద్రమోహన్ ఏవిధంగా అనర్హుడో అఫిడవిట్‌లో పేర్కొనలేదు. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

» పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

» ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వర్క్‌షాప్‌లో లోకేశ్



ఏపీ విద్యావిధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పాల్గొన్న ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, పరిటాల సునీత, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్సీ అనురాధ తదితరులు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తెస్తున్నట్టు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్, జీవో 117కు ప్రత్యామ్నాయం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సోమవారం ఉండవల్లిలోని నివాసంలో వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యారంగంలో ఎలాంటి మార్పులు చేపడితే బాగుంటుందనే దానిపై వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, దేశంలోనే ఏపీ విద్యా వ్యవస్థను నంబర్ 1 చేయాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. తాను యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు జీవో 117 వల్ల కలిగిన దుష్ఫలితాల గురించి అనేక మంది తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. జీవో 117 పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారన్నారని, వారంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరారని చెప్పారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నివేదిక ప్రకారం జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ పాఠశాల విద్యలో ఎక్కువ అభ్యసన అంతరం ఏర్పడిందన్నారు. 3వ తరగతి విద్యార్థుల్లో.. భాషా సబ్జెక్టుల్లో 57శాతం మంది, గణితంలో 54శాతం మంది మాత్రమే అంచనా మేరకు మెరుగ్గా ఉన్నారన్నారు. ఇది జాతీయ సగటుతో పోలిస్తే 5 నుంచి 8శాతం తక్కువని చెప్పారు. పైతరగతుల్లో ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉందన్నారు. అసర్-2024 నివేదిక రాష్ట్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీలో లోపాలను బహిర్గతం చేసిందన్నారు. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం టీచర్ విద్య శిక్షణలో ఏపీ 60 పాయింట్లు సాధించిందన్నారు.

నియోజకవర్గానికో మోడల్ స్కూల్!

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు జీవో 117 రద్దుచేసి, ప్రత్యామ్నాయం తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సీబీఎస్ఈపై విద్యార్థులకు మాక్ పరీక్ష నిర్వహిస్తే 90శాతం మంది ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఐబీ సిలబస్ పేరుతో రూ.5 కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. విద్యారంగంలో ఉత్తమ విధానాల అమలుకు టీచర్లను విదేశాలకు పంపుతామన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై కొందరు టీచర్లు పోలాండ్‌లో అధ్యయనం చేస్తారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు.

ప్రజాప్రతినిధుల సూచనలు ఇవీ..

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస స్థాయిలో అయినా విద్యార్థుల సంఖ్య ఉంటే ఇబ్బందులుండవని, దీనికి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని కొణతాల రామకృష్ణ అన్నారు. శివారు ప్రాంతాలున్న గ్రామాల్లో విద్యార్థులకు రవాణా ఇబ్బంది లేకుండా చూడాలని బండారు సత్యనారాయణమూర్తి కోరారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌కు కనీస విద్యార్థుల సంఖ్య 45 చేయాలని లోకం మాధవి సూచించారు. గురుకుల పాఠశాలలు పెంచాలని కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులకు ఎంసెట్, ఐఐటీ కోచింగ్ నిర్వహించాలని కొండబాబు కోరారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక అమలుచేయాలని కాల్వ శ్రీనివాసులు సూచించారు.

18 మీటర్ల లోపు ఎత్తు భవన నిర్మాణాలకు

స్వీయ ధ్రువీకరణ ఇస్తే సరి

» టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేదు!

» భవన నిర్మాణదారులకు ఏపీ సర్కారు శుభవార్త

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవన నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోతుంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు అనుమతి వస్తుంది. అయితే భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్‌టీపీలు, ఇంజనీర్లు లేదా ఆర్కిటెక్ట్‌ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి అఫిడవిట్ ఇవ్వాలి. దీనికి సంబంధించి గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీచేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఏపీడీపీఎంఎస్ పోర్టల్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం, సర్క్యులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు, 1985కు ముందు నిర్మించిన భవనాల పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

పర్చూరు ఓట్ల తొలగింపు కుట్రపై 'సిట్'

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విజయం సాధించడానికి అక్రమ మార్గంలో ఓట్ల తొలగింపునకు పాల్పడిన వారి గుట్టు రట్టు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ నేతృత్వంలో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్‌తోపాటు మరికొందరు పోలీసుల్ని సభ్యులుగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో బాపట్ల జిల్లా పర్చూరులో గుట్టు చప్పుడు కాకుండా 24 వేల మంది ఓటర్లకు సంబంధించి ఫారమ్ 7 ఇచ్చి ఓట్ల తొలగింపునకు ప్రయత్నించారు. అప్పటి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూటమిసర్కారుకి మరోసారి ఫిర్యాదు చేయగా పరిశీలించిన ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు చేసింది.



చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

ఆస్కార్ వేడుకలు.. అనోరాకు అగ్రస్థానం



ప్రపంచ సినీ రంగంలో ఉన్నత పురస్కారంగా భావించే 97వ ఆస్కార్ అవార్డుల వేడుక కన్నులపండువగా సాగింది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఆదివారం సాయంత్రం (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) నిర్వహించిన ఈ కార్యక్రమానికి కానన్ ఓబ్రియాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయన భారతీయులను ఉద్దేశించి హిందీలో మాట్లాడడంతో పాటు 'బ్రేక్ ఫాస్ట్ చేశారా' అని అనడం అందర్నీ ఆకట్టుకుంది.

ఈ వేడుకలో అందర్నీ ఆశ్చర్యపరిచిన చిత్రం 'అనోరా'. చిన్న చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా ఐదు అకాడమీ అవార్డులను దక్కించుకుంది. ఉత్తమ చిత్రం, ఎడిటింగ్, స్ర్కీన్ ప్లే, దర్శకుడు, నటి విభాగంలో పురస్కారాలు దక్కించుకుంది. దర్శకత్వంతో పాటు ఎడిటింగ్, స్ర్కీన్ ప్లే అందించిన సీన్ బేకర్.. ఒకే చిత్రానికి నాలుగుసార్లు అవార్డు అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. వాల్ట్ డిస్నీ గతంలో వేర్వేరు సినిమాల ద్వారా నాలుగు అవార్డులను అందుకున్న సంగతి తెలిసిందే. సీన్ బేకర్ ఈ అవార్డును వేశ్యలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థియేటర్ల మనుగడను కాపాడాల్సిన అవసరాన్ని చెప్పారు.


ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ

బ్రాడీ కార్బెట్ తెరకెక్కించిన 'ద బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు అడ్రియన్ బ్రాడీ. ఆయనకు ఇది రెండో ఆస్కార్ పురస్కారం. 2002లో రోమన్ పొలాన్‌స్కీ దర్శకత్వంలో తెరకెక్కిన 'పియానిస్ట్' అతి పిన్న వయస్కుడిగా తొలిసారి ఆస్కార్‌ను అందుకున్నారు. ఈ రెండు సినిమాలు హోలోకాస్ట్ నేపథ్యంలో రూపొందినవే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధించిన విజయాలు, ఘనతలు శాశ్వతం కాదని తెలిపారు. అలాగే, 'ద రియల్ పెయిన్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటుడిగా అవార్డును అందుకున్నారు కీరన్‌కైల్ కల్కిన్.

ఉత్తమ నటిగా మైకీ మ్యాడిసన్

'అనోరా' చిత్రానికి ఉత్తమ నటిగా పురస్కారం అందుకున్నారు మైకీ మ్యాడిసన్. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాలో ఆమె వేశ్య పాత్రలో నటించారు. ఈ అవార్డును అందుకోవడం కలలా ఉందని మ్యాడిసన్ చెప్పారు. అలాగే, 'ఎమిలియా పెరెజ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటిగా జో సాల్దాన అవార్డును అందుకున్నారు. అత్యధిక నామినేషన్లతో రేసులో నిలిచిన నాన్ ఇంగ్లీష్ చిత్రం 'ఎమీలియా పెరెజ్' కేవలం రెండు అవార్డులతో సరిపెట్టుకుంది. పది నామినేషన్లు సాధించిన 'బ్రూటలిస్ట్' చిత్రం మూడు అవార్డులు పొందింది. 'డ్యూన్ 2' చిత్రం రెండు అవార్డులను సొంతం చేసుకుంది.

ఆస్కార్ బృందంలో తెలంగాణ వాసి పాత్ర



ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌లో పురస్కారం పొందిన 'డ్యూన్ 2' చిత్రం వీఎఫ్ఎక్స్ టీమ్‌లో తెలంగాణ వాసి ఉండడం విశేషం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ అమినాపురంకు చెందిన ఎడ్ల సుమంత్‌రెడ్డి ఈ చిత్రానికి ఆరు క్యారెక్టర్లను డిజైన్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం: అనోరా
ఉత్తమ దర్శకుడు: సీన్ బేకర్ (అనోరా)
ఉత్తమ నటుడు: అడ్రియన్ బ్రాడీ (ద బ్రూటలిస్ట్)
ఉత్తమ నటి: మైకీ మ్యాడిసన్(అనోరా)
ఉత్తమ సహాయ నటుడు: కీరన్‌కైల్ కల్కిన్ (ద రియల్ పెయిన్)
ఉత్తమ సహాయ నటి: జో సాల్దాన (ఎమిలియా పెరెజ్)
ఉత్తమ ఎడిటింగ్ : అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ద బ్రూటలిస్ట్ (లాల్ క్రాలే)

అనూజకు నిరాశ

భారత్ తరఫున ఆస్కార్ నామినేషన్ పొందిన లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ 'అనూజ' చిత్రానికి నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పోటీపడుతున్న చిత్రాలను ఓడించి, 'ఐ యామ్ నాట్ ఏ రోబో' లఘు చిత్రం పురస్కారాన్ని కైవసం చేసుకుంది.

ఉర్దూ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉర్దూ గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు సోమవారం తెలిపారు. పాఠశాల స్థాయిలో 5, 6, 7 ,8 తరగతిలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సరాల్లో ప్రవేశానికి ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఏపీఆర్జేసీ సెట్ పరీక్ష ద్వారా అడ్మిషన్లు పొందాలని సూచించారు. కోస్తా ఆంధ్రలో ఉన్న ముస్లిం విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం ఏపీ ఆర్ఎస్ సొసైటీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 8712625073, 9652569140 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పౌర్ణమికి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 12న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 13వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 14న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజున అరుణచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం బయల్దేరి 15వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జి రూ2,420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403 సంప్రదించాలని కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 527.80 అడుగులు ఉంది. ఇది 163.88 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8807 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,850 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,770 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 39,109 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

‘యూత్ పార్లమెంట్’లో భాగస్వామ్యం కావాలి

● ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమ పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మేధాశక్తిని ఉపయోగించి ప్రపంచంలో కెల్లా మన దేశాన్ని ప్రథమ స్థానంలో ఉంచేలా కృషి చేయాలనీ, అందులో భాగంగానే యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య డి.దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ జిల్లా స్థాయి నోడల్ అధికారులుగా జాతీయ సేవా పథకం జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి కిరణ్మయి దేవిరెడ్డిలను ప్రభుత్వం నియమించినట్లు చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 18 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం ఒక నిమిషం నిడివి కలిగిన "వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టూ యూ" అనే అంశంపై వీడియో చేసి మార్చి 9వ తేదీలోపు మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలియజేశారు. తరువాత స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందనీ, ఈ గొప్ప అవకాశాన్ని యువత అందరూ తప్పనిసరిగా వినియోగించుకుని దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్‌డి ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్ ఈ కార్యక్రమం విశిష్టతను వివరించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న పాల్‌కుమార్, కోటేశ్వరమ్మ, చైర్మన్ శేషగిరిరావు

నరసరావుపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభం అయ్యాయి. పోటీలను ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పీపీఎస్ పాల్‌కుమార్, టైనీటాట్స్ స్కూల్ అధినేత పాతూరి కోటేశ్వరమ్మ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకి బానిసలు అవుతున్నారనీ, ఆటపాటలకు దూరంగా ఉంటున్నారని అన్నారు. మొబైల్‌కి దూరంగా ఉంటూ ఆటలు, చదువులో ముందుండాలని అన్నారు. మహిళలు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. ఏఎన్‌యూ అంతర కళాశాల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఆతిథ్యం ఇస్తుందని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య మాట్లాడుతూ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు కరైకుడిలోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా మహిళల అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో ఆరేపల్లి ముప్పాళ్ళ ధనలక్ష్మి కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్, కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కాలేజి, నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్, తెనాలి జేఎంజే జట్లు పాల్గొంటున్నాయి. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ సీహెచ్ వెంకటరావు, జె.ప్రేమ్‌కుమార్, ఈదర ఆదిబాబు, డాక్టర్ అరుణ సుజాత వ్యవహరిస్తున్నారు. నాకౌట్ మ్యాచ్‌లలో జరిగిన పోటీలలో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, లీగ్ మ్యాచ్‌లో ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు మంగళవారంతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ధ్రువీకరణ పత్రం... నకిలీ సిత్రం

(5వ పేజీ తరువాయి)



తహసీల్దార్ స్టాంప్ పైన ఉండాల్సిన సంతకం అర్థం కాకుండా స్టాంప్‌లో కలసిపోయేలా గీతలు గీసిన సంతకం, స్టాంప్ కూడా పెద్ద సైజులో ఉండాల్సి ఉంటే, చిన్నది తయారు చేయించి వేసిన చిత్రం

మధ్యలో ఉన్న కొద్ది రోజుల్లో అధికారిక స్టాంపులతో దోచిపెట్టారా! అనేది అర్థంకాని విషయం. సాధారణంగా జగనన్న కాలనీల్లో భూములు ఇవ్వాలంటే పేదలయి ఉండాలి. కానీ ఇక్కడ కొన్ని సంస్థల పేరుపెట్టి కొందరు వ్యక్తులు భూములను నొక్కేశారు. సామాన్యుడికి పట్టణ ప్రాంతాల్లో కేవలం ఒక్క సెంటు భూమి మాత్రమే అప్పటి జగన్ సర్కారు ఇస్తే, వీరు రెండు నుంచి ఐదు సెంట్ల వరకు తీసుకున్నారు. అయితే పేదలకు కేటాయించిన ప్లాట్లలో అయితే ఆధార్ వంటి అన్ని పత్రాలు అప్‌లోడ్ చెయ్యాల్సిన పరిస్థితి ఉండటం, సంస్థలకు వీటిలో ఇచ్చే అవకాశం లేకపోవటంతో ఒక్కో కాలనీలో ఇళ్ల కేటాయించిన లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలు, పార్క్, ఆట స్థలాల వంటివాటి కోసం కేటాయించిన కమ్యునల్ స్థలాలను టార్గెట్‌గా చేసుకుని ఈ నకిలీ పత్రాలతో ఆక్రమించేశారు.

ధ్రువీకరణ పత్రాలతో పన్నుల చెల్లింపు

ఒక భూమిపై హక్కు పొందాలంటే ప్రభుత్వం అధికారికంగా అందించిన పట్టా ఉండాలి. లేక నివేశన స్థల ధ్రువపత్రం కానీ, పట్టా కానీ ఉండాలి. కానీ ఇక్కడ నకిలీ ధ్రువీకరణ పత్రాలు పుట్టుకొచ్చాయి. పెదరావూరు లేఔట్‌లో కమ్యునల్ స్థలాన్ని ఆక్రమించి ఉండటం గుర్తించిన రెవెన్యూ అధికారులు వారిదగ్గరున్న పట్టాను చూపాలని కోరటం, రెండు ప్రయివేటు సంఘాల పేరుతో స్థలాలు పొందినట్లు ధ్రువపత్రాలు చూపటంతో వాటిని పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. అయితే ఇదే తరహాలో తాజాగా ఒక ప్రైవేటు స్థలానికి, మండల పరిధిలోని మరికొన్ని ప్రభుత్వ స్థలాలకు ఇదేతరహా పత్రాలను చూపి పన్నులు చెల్లించనట్లు సమాచారం అందటంతో అధికారులు వీటిపై దృష్టిపెట్టారు. మండలంలో ఎక్కడెక్కడ ఎంత మేర ప్రభుత్వ భూములను ఆక్రమించారో తెలుసుకునే పనిలో పడ్డారు. ఇంతటి వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా జరిగే అవకాశం తక్కువ. అయితే దీనికి సహకరించింది ఎవరు? ఇంకా ఎంతమందికి! ఎన్ని రూ. కోట్ల విలువైన స్థలాలను అప్పగించేశారనేది తేలాల్సిఉంది. దీనిపై వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. అధికారికంగా చెప్పకున్నా, ఈ నకిలీల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారని మాత్రం సమాచారం.

పట్టభద్రుల పోరులో.. కూటమి దూకుడు

(5వ పేజీ తరువాయి)

రౌండ్‌లోనూ ఆలపాటి హవా కొనసాగింది. ఈ రౌండ్‌లో ఆలపాటికి 16,722 ఓట్లు రాగా, లక్ష్మణరావుకు 7404 ఓట్లు వచ్చాయి. 2978 ఓట్లు చెల్లుబాటు కాలేదు. నాల్గో రౌండ్‌లో ఆలపాటికి 16236 ఓట్లు, లక్ష్మణరావుకు 7828 ఓట్లు రాగా 3035 ఓట్లు చెల్లుబాటు కాలేదు. ఐదో రౌండ్‌లో ఆలపాటికి 16916, లక్ష్మణరావుకు 7535 ఓట్లు రాగా 2800 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. దీంతో ఐదో రౌండ్ ముగిసేసరికి ఆలపాటి మెజార్టీ 47,872కి చేరింది.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాదు తన రాజకీయ అనుభవాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రంగరించారు. ఎవరూ ఊహించనంతగా తొలి ప్రాధాన్య ఓట్లు తనకు వేసేలా పట్టభద్రుల్లో చైతన్యం నింపారు. ఏ బ్యాలెట్ బాక్సు తెరిచి ఓట్ల లెక్కింపు ప్రారంభించినా కౌంటింగ్ హాల్ అంతా ఆలపాటి పేరే వినిపించింది. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేసరికే దాదాపుగా 10 వేల మెజార్టీ లభించడంతో అక్కడే రాజా విజయం ఏ స్థాయిలో ఉండబోతుందో చెప్పకనే చెప్పినట్లు అయింది. అది మొదలుకొని ప్రతీ రౌండ్‌లోనూ ఆయన హవా కొనసాగింది. నాల్గో రౌండ్ కౌంటింగ్ ముగిసేసరికే ఆలపాటికి సమీప ప్రత్యర్థి అయిన సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కౌంటింగ్ హాల్‌ని విడిచి వెళ్లిపోయారు.

పక్కా ప్రణాళికతో ఓట్ల లెక్కింపు

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారు. ఎన్నికల నిర్వహణలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లారు. ఎలక్షన్ షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి కోడ్‌ని పకడ్బందీగా అమలు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరోవైపు పోలింగ్, ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని నియమించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించారు. ఎక్కడా ఎలాంటి అస్పష్టతకు తావు లేకుండా ఎన్నికలనట నిర్వహించారు. గత ఎన్నికల్లో కంటే ఈ దఫా లక్ష ఓట్లు అధికంగా పోలింగ్ అయ్యాయి. అయినప్పటికీ ఫలితం ముందుగానే వెలువడేలా చేశారు. కౌంటింగ్ హాల్ విశాలంగా ఉండటంతో నాలుగు వరసల్లో ఏడు టేబుళ్ల చొప్పున 28 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయించారు. ఇది ఓట్ల లెక్కింపుని సులభతరం చేసింది.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో కాలనీ 5వ లైన్‌లో జొన్నలగడ్డ శ్యాంప్రసాద్ ముఖర్జీ (54) అనే వ్యక్తి జామ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు శ్యాంప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతుండడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ఐదేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. శ్యాం ప్రసాద్‌కు ఇద్దరు సోదరులు ఉన్నారు. అన్న విదేశాల్లో ఉండగా తమ్ముడు వసంతరాయపురంలో ఉంటాడు. తన తండ్రికి చెందిన పాడుపడిన ఇంటిలో శ్యాంప్రసాద్ ఒక్కరే ఒంటరిగా ఉంటున్నాడు. భార్య, పిల్లలు దూరం కావడం, ఏ పని చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. అన్నదమ్ములకు జాయింట్‌గా ఉన్న ఇంటిని విక్రయించాలంటే సోదరుడు విదేశాల్లో ఉండడంతో సాధ్యం కాలేదు. మనస్తాపానికి గురైన శ్యాంప్రసాద్ జామచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు

విశ్రాంత పోలీస్ అధికారి పృథ్వీనారాయణ హఠాన్మరణం



పృథ్వీ నారాయణ (ఫైల్)

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఏఎస్పీ బి.పృథ్వీనారాయణ (77) హఠాన్మరణం చెందారు. అమెరికాలో గుండెపోటుతో సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పోలీస్ శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పృథ్వీనారాయణ అత్యంత ధైర్య సాహసాలతో విధులు నిర్వహిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు వివాదాస్పదమైనప్పటికీ వెనక్కు తగ్గలేదు. తాను పనిచేసిన ప్రతి చోట రౌడీ షీటర్లు, దొంగలు, ఫ్యాక్షనిస్టులు, ఈవ్‌టీజర్లపై కఠిన వైఖరి అవలంబించి శాంతి భద్రతలు కాపాడారు. విజయవాడకు చెందిన పృథ్వీనారాయణ 1974లో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఆయన ఎస్సైగా, సీఐగా, డీఎస్పీగా సుదీర్ఘకాలం సేవలందించారు. గుంటూరు, నరసరావుపేట, తెనాలి తదితర సబ్ డివిజన్ల పరిధిలో ఆయన ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పని చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇద్దరికి వివాహాలయ్యాయి. వారు ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. ఐదు నెలల క్రితం పృథ్వీనారాయణ, లీల దంపతులు అమెరికాలో పిల్లల వద్దకు వెళ్లారు. అక్కడ వారి వద్ద ఉండగా సోమవారం మధ్యాహ్నం ఆయనకు గుండెపోటు రావడంతో కన్నుమూశారు.

పలువురి సంతాపం

విశ్రాంత ఏఎస్పీ పృథ్వీనారాయణ ఆకస్మిక మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం మాలకొండయ్య, కాళహస్తి సత్యనారాయణ, జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, న్యాయవాది బండి రామ్మూర్తి నాయుడు, విశ్రాంత డీఎస్పీ కేవీ నారాయణ, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నిరిపురప శ్రీధర్ శర్మ సంతాపం వ్యక్తం చేశారు.

కొత్త థెరపీల అభివృద్ధికి దోహదం



మాట్లాడుతున్న ఆచార్య అప్పారావు

గుంటూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): క్రిస్పర్, క్యాస్9 సాంకేతికత ద్వారా జీనోమ్‌లో నిర్దిష్ట మార్పులు, జన్యుపరమైన రుగ్మతలను సరిదిద్దడం, వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందడం, కొత్త థెరపీల అభివృద్ధికి విస్తృతంగా ఉపయోగపడుతుందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ పొదిలి అప్పారావు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మోలిక్యులర్ బయోలజీ అండ్ బయోటెక్నాలజీ' అనే అంశంపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆచార్య అప్పారావు మాట్లాడుతూ ప్లాంట్ మైక్రోబియోమ్ అనేది ఒక మొక్క చుట్టూ, దాని లోపల నివసించే సూక్ష్మజీవుల (బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లు, ఇతర మైక్రో ఆర్గానిజం) సమూహమని, ఈ సూక్ష్మజీవులు మొక్కల పెరుగుదల, వ్యాధి నిరోధకత, భూసార వృద్ధికి ఎంతో సహాయపడతాయని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితిలో ప్లాంట్ మైక్రోబియోమ్‌పై పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ రాజగోపాల్ సుబ్రమణ్యం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ పి.కొండయ్య, ప్రొఫెసర్, వర్క్‌షాప్ కన్వీనర్ ఆగేపాటి ఎస్.రాఘవేంద్రరావు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నింటికీ మూలం రసాయన శాస్త్రం

పెదకాకాని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రాలన్నింటికీ మూల శాస్త్రం రసాయన శాస్త్రం అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. గంగాధరరావు మాట్లాడుతూ వర్తమాన కాలంలో మానవ వైద్యం నిమిత్తం ఉపయోగిస్తున్న అనేక రకాల మందులు, ఎన్నో రకాల టీకాలు, ఔషధాల్లో రసాయన శాస్త్రమే కీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో పురుగుమందులు, ఎరువుల తయారీ రసాయన శాస్త్రాన్ని అనుసరించే జరుగుతాయని తెలియజేశారు. టాంజానియాలోని డోడామ యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎస్‌బీ నంబూరి మాట్లాడుతూ రసాయన శాస్త్రం మానవ జీవన విధానంలో ఎలా సమ్మిళితం అయిందో వివరించారు. ఆచార్య ఎం.సుబ్బారావు సంచాలకులుగా నిర్వహించిన ఈ సదస్సుకు ఆచార్య దిట్ట కవి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. సదస్సులో ఏఎన్‌యూ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సైన్స్ కళాశాల ప్రాచార్యులు ఆచార్య వీరయ్య, దూరవిద్య కేంద్ర సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య ఆర్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఆచార్య పి.పద్మావతి, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాడు కాశీ విశ్వేశ్వరాలయంలో చోరీ

● రూ.9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాల అపహరణ



కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో తొలగించిన తలుపు నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ప్రత్తిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిపాడు కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు 9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. దేవాలయానికి పటిష్ఠంగా రెండు వైపులా ఇనుప తలుపులతో పాటు ప్రధాన ద్వారాలు ఉన్నాయి. ఆ తరువాత గర్భగుడికి కూడా ఇనుప గేటుతో తాళం వేసి ఉంటుంది. ఈ రెండు గేట్లను దాటుకుని దుండగులు గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారి మూడు కేజీల వెండి నాగాభరణంతో పాటు అమ్మవారి బంగారు తాళిబొట్టు, గొలుసు, బొట్టు, బులాకీలను అపహరించుకు పోయారు. వీటి విలువ సుమారు రూ. 9 లక్షలు ఉంటుందని ఆలయ అర్చకుడు బాబు తెలిపారు. ఆలయ అర్చకునితోపాటు 35 మంది భక్తులు శివ మాల ధరించి ఆదివారం రాత్రి శ్రీశైలం వెళ్లారు. ఆదివారం రాత్రి పూజారి భార్య తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. ఒక్కరే ఈ చోరీ చేసినట్లు ఆలయంలోని సీసీ ఫుటేజిలో కన్పిస్తుంది. అయితే వచ్చిన దొంగ చేతికి గ్లౌజులు ధరించి ఉన్నాడు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు.

గంజాయి విక్రేత అరెస్టు



నిందితుని వివరాలు వెల్లడిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కల్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని సీతానగరం పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో నిఘా పెట్టారు. ఇందులో భాగంగా రైల్వే వంతెన వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పట్టుకునే క్రమంలో ఇద్దరు పారిపోగా విజయవాడ విద్యాధరపురంకు చెందిన గుమ్మడి సాయికుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఒక కేజీ 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కాగా విజయవాడకు చెందిన కోటి, మహేష్ అనే వారిని పట్టుకుంటామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200.00
చికెన్ స్కిన్ లెస్	210.00

1,55,229 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,82,384 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,55,229 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 71,945 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా సోమవారం 341 వెరైటీ మిర్చి ఈ సీజన్‌లో తొలిసారిగా క్వింటాల్ రూ. 15 వేల ధరకు అమ్ముడైంది.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	13000
334	9000	13900	బ్యాడిగి 355	10500	13500
నంబరు. 5	10500	14500	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10000	12500
341	10500	15000	ఎన్ఎస్ 250		
4884	9000	13000	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	12500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11500
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

బాపట్ల వార్తలు

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు : సీడీపీవో

రేపల్లె, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీడీపీవో ఎం.సుచిత్ర అన్నారు. స్థానిక సీడీపీవో కార్యాయంలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాల్య వివాహాల నిర్మూలన, వాటిపై అవగాహన ప్రచారం నిర్వహించారు. అనంతరం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్క తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వయసు మించిన తరువాతే వివాహాలు చేయాలని తెలిపారు. అనంతరం మొక్కలు నాటి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలోని జిల్లా పరిషత్ స్కూల్లో సోమవారం మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎం.అనసూయ బాల్య వివాహాల నిర్మూలన, లింగవివక్షత, చదువు ప్రాముఖ్యత గురించి వివరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండకుండా ఆడపిల్లలకు, 21 సంవత్సరాలు నిండకుండా మగపిల్లలకు పెళ్ళి చేస్తే సామాజికంగా, శారీరకంగా, ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతాయో వివరించారు. బాల్య వివాహలు చేస్తే చట్టప్రకారం ఎటువంటి చర్యలు ఉంటాయో చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాటూరి లక్ష్మీనారాయణ, పోలేరమ్మ గుడి పూజారి శ్రీనివాసశర్మ, చర్చి పాస్టర్ నిరీక్షణరావు, అంగన్‌వాడీ సిబ్బంది, స్కూల్ బాలికలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పేరలి గ్రామం మల్లెలవారిపాలేనికి చెందిన కాగిత ఏసుమ్మ మృతి చెందారు. పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహాయ సహకారంతో టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, గేరా ఏసుబాబులు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థికసాయం మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాగిత విజయరాజు, మద్దిబోయిన బుల్లియ్య, చిట్టిబాబు, రత్నరాజు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యాలయం, కావూరు పాఠశాలలో 2025-26వ విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరడానికి, అలాగే 6, 7, 8 తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి ప్రవేశానికై ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఎల్‌ఈఈపీఎస్//ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. వీటికి ఏప్రిల్ 2, 4, 5వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో రాజస్థాన్ యువకుడి ఆత్మహత్య


కేశారామ్ మృతదేహం

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో రాజస్థాన్ యువకుడు బాపట్లలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం రాజస్థాన్‌కు చెందిన కేశారామ్ (21)తన బావ దోనారామ్‌తో కలిసి మూడేళ్ళ క్రితం పొన్నూరు వచ్చి అక్కడ సెల్‌పాయింట్ పెట్టారు. రెండేళ్ళక్రితం బాపట్ల వచ్చి సూర్యలంక రోడ్డులో సెల్‌పాయింట్ పెట్టి నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కేశారామ్ సోమవారం మధ్యాహ్నం షాపు నుంచి భోజనానికి వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళాడు. వెళ్ళిన వ్యక్తి తిరిగి రాకపోవటంతో దోనారామ్ ఫోన్ చేసినప్పటికి తీయకపోవటంతో ఇంటి యాజమానికి ఫోన్ చేసి చూడమని చెప్పగా ఆయన వెళ్ళి చూసేసరికి ఉరిపెట్టుకొని ఉన్నట్లు గుర్తించి స్థానికులను పిలిచి కిందకు దించారు. అప్పటికే కేశారామ్ మృతి చెందటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్మెట్ ధరించటంపై నిర్లక్ష్యం తగదు

- అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్
- మహిళా ఉద్యోగులకు హెల్మెట్‌లు పంపిణీ


మహిళా ఉద్యోగులకు హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించటంపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. మహిళా సాధికారిత వారోత్సవాలలో భాగంగా డాక్టర్ శిఖేంద్రనాద్ ఫౌండేషన్ నిర్వాహకుల సహకారంతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు ద్విచక్రవాహనాలపై వచ్చే మహిళా సిబ్బందికి అడిషనల్ ఎస్పీ హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎంబీబీఎస్ చదివి పీజీ కోర్సుకు శిక్షణ తీసుకుంటూ రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేని కారణంగా మృత్యువాతపడిన ఘటనను తలుచుకుంటే ఎంతో ఆవేదనగా ఉందన్నారు. రోడ్డు ప్రమాదం కారణంగా తమ కుటుంబంలో జరిగిన ఘోర ఘటన వేరొకరికి జరగకూడదనే ఉద్దేశ్యంతో ప్రసాద్, మాధవిలతలు తమ కుమారుడి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. మార్చి 1వ తేదీ నుంచి మహిళా సాధికారిత వారోత్సవాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా మహిళా పోలీసులకు వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఫౌండేషన్ స్థాపకులు చంద్రప్రసాద్, మాధవిలత, డైరెక్టర్‌లు జితేంద్ర, భార్గవ, కొర్రపాటి చక్రధర్, ఇషాంత్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయమ్మ


అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ వైద్యసిబ్బంది

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు వినికిడి ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్.విజయమ్మ ప్రారంభించి మాట్లాడుతూ చెవి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెద్ద శబ్దాల నుంచి చెవిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలిలో....

వేమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఆడియో లాజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథలాజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజేంద్ర హియరింగ్ క్లినిక్ వారి సౌజన్యంతో మండలంలోని పెరవలి వెస్ట్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వినికిడి పరీక్షలు జరిపారు. డాక్టర్ ఏంజిల్ రిచార్స్ విద్యార్థులకు వినికిడి పరీక్షలు నిర్వహించి చెవులు పని చేసే విధానం, వినికిడి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో క్లినిక్ సిబ్బంది విజయలక్ష్మి, రాధిక, భార్గవి, ప్రధానోపాధ్యాయుడు కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో విద్యార్థినికి వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు


అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి జి.దేవదత్తు

సారారహిత సమాజం స్థాపిద్దాం

- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి దేవదత్తు

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సారా రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి జి.దేవదత్తు పిలుపునిచ్చారు. మండలంలోని స్టూవర్టుపురం గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి అక్కడ జరిగిన సమావేశంలో దేవదత్తు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించటం వల్ల అనేక దుష్పరిణామాలకు దారితీస్తుందన్నారు. సారా, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని, ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ బి.వెంకటేశ్వర్లు, సీఐ పి.గీతిక, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన సలోమి


సలోమిని అభినందిస్తున్న డీఎస్‌డీవో పాల్‌కుమార్

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు బాపట్ల విద్యార్థిని వై.సలోమి ఎంపికైనట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి కె.పాల్‌కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కంచకచర్ల ఏకత్వ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 11వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కేటగిరి బాలబాలికల పెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో బాపట్ల ఖేలో ఇండియా పెన్సింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న సెలోమి పాల్గొని వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా సెలోమిని, కోచ్ నాగ చిరంజీవిని డీఎస్‌డీవో పాల్‌కుమార్ సోమవారం అభినందించారు.

ఆక్రమణకు గురైన కాల్వలను సర్వే చేయించాలి

- నరసాయపాలెం గ్రామ రైతుల వినతి


తహసీల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేస్తున్న నరసాయపాలెం రైతులు

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాయపాలెం గ్రామంలో ఆక్రమణకు గురైన మాన్యాల కాల్వను సర్వే చేయించాలని కోరుతూ ఆ ప్రాంత రైతులు సోమవారం తహసీల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. కాల్వ ఆక్రమణకు గురికావటం వల్ల దిగువనున్న భూములకు నీరు అందటంలేదన్నారు. సర్వే చేయించి కాల్వలు తవ్వించి నీరు సజావుగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిరుపేదలకు చేయూత

కర్లపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్, బాపట్ల ఆధ్వర్యంలో కర్లపాలెం మండల దాసునగర్ గ్రామంలోని నిరుపేదలకు 10 కేజీల బియ్యం అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు పెనుమెత్స శివాజీరాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తమవంతు సహాయంగా బియ్యం, నిత్యవసరాలు, దుప్పట్లు, అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్థిక చేయూత అందించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంతెన నాగవర్మ, చాపల సుబ్రహ్మణ్యం, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

బాపట్ల రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మచిలీపట్నంకు చెందిన శ్రీనివాస్, నరసింహమూర్తి, శాంతకుమారి అనే ముగ్గురు మచిలీపట్నం నుంచి కారులో చీరాల వెళుతుండగా బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి నాలుగురోడ్ల కూడలి వద్ద కారు టైరు పగిలిపోవటంతో ఒక్కసారిగా కారు అదుపు తప్పి పల్టీలుకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు క్షతగాత్రులను తరలించారు.

ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ఐక్యత చాటేది రంజాన్ మాసం

- తాజుల్ ఔలియా దర్బార్ వ్యవస్థాపకుడు తాజ్ ఖాదరీ బాబా

వేమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతన దాతృత్వం ఐక్యతను చాటేది రంజాన్ మాసం అని, అందుకే ఈ మాసం ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారని ఆస్థాన అతా ఏబాగ్ ఏ సర్కార్ తాజుల్ ఔలియా దర్బార్ వ్యవస్థాపకుడు సబ్జా దఅల్ ఖాద్రీయ అతా మహమ్మద్ నిజాముద్దీన్ నిజా మీషా తాజ్ ఖాదరీ బాబా అన్నారు. మండలంలోని జంపని గ్రామంలో ఏర్పాటై ఉన్న ఆశ్రమంలో ఆయన ఆదివారం రాత్రి నుంచి రంజాన్ పండుగ పర్వదినాలను పురస్కరించుకుని నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లింలకు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుని ఉన్న రంజాన్ మాసంలో ఉపవాసం ప్రార్ధన అల్లా అనుగ్రహం కోసం దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.


జంపని ఔలియా దర్బార్‌లో అన్నదానం నిర్వహిస్తున్న తాజ్ ఖాదరీ బాషా

బాలికలకు వ్యాసరచన పోటీలు


కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కొల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, పక్షపాత నిబంధనలు సవాల్ చేయడంలో పురుషుల ప్రమేయం, ఆవశ్యకత అంశాలపై విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం మీనాక్షి, ఎఎస్ఐలు అర్జున్, రామయ్య, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

వేమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మహిళా దిన వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు చట్టాలు, వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇంత వరకు ఆ దిశగా ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.6 వేల పింఛన్ అందించాలని కోరారు. ఈ నెల 28న భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక సంఘ నాయకులు ఓబులశెట్టి రమేష్, విష్ణుమొలకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో రోడ్డుకు మోక్షం

చెరుకుపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రాంబొట్లవారిపాలెం గ్రామ పంచాయతీ నుంచి మోరవాగుపాలెం వెళ్ళే మట్టి డొంక బాగా గుంతలు పడిపోవడంతో స్థానిక రైతులు, టీడీపీ కార్యకర్తలు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్ళడంతో ఆయన వెంటనే స్పందించి అనగాని శివప్రసాద్ సారథ్యంలో మట్టిడొంక గుంతలను స్థానికంగా తీసివేసిన పాత బిల్డింగ్ వ్యర్థాలతో రిపేరు చేయించారు. దీనికి సుమారుగా లక్షన్నర ఖర్చు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు అలుమోలు చిరంజీవిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టు సాంబిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు అలుమోలు దుర్గారెడ్డి పాల్గొన్నారు.


గుంతలు పూడ్చి చదును చేస్తున్న రోడ్డు


ఆహ్వాన పత్రికను మంత్రి అనగానికి అందిస్తున్న కమిటీ సభ్యులు

9న విఘ్నేశ్వరస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ

- మంత్రి అనగానికి ఆహ్వానపత్రిక అందజేత

రేపల్లె, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఉన్న శ్రీసిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠా మహోత్సవం ఈనెల 9వ తేదీ ఉదయం 10గంటల 50నిమిషాలకు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు తెలిపారు. మంత్రి అనగానికి విఘ్నేశ్వరస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠకు హాజరవ్వాలని సోమవారం ఆహ్వాన పత్రికను అందించారు. 300 ఏళ్ళ చరిత్ర కలిగిన సిద్ధి విఘ్నేశ్వర దేవాలయం శిథిలావస్థకు చేరుకోవటంతో పట్టణవాసుల సహాయ సహకారాలు, మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.5 లక్షల విరాళం ఎంపీ నిధులతో దేవాలయాన్ని పునఃనిర్మాణానికి ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొననున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు వేమూరు వెంకటేశ్వరరావు, మరకా మురళి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తనిల్వలు లేకుండా చూడాలి : కమిషనర్

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్లపై చెత్తనిల్వలు లేకుండా చూడాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి సచివాలయాల పారిశుద్ధ్య కార్యదర్శులను ఆదేశించారు. పారిశుద్ధ్యం విషయంలో అలసత్వం వహించవద్దని సూచించారు. వార్డులలో డ్రైనేజి పూడికలు తీయించాలని చెప్పారు. ఆయన సోమవారం సూర్యలంకరోడ్డులో పర్యటించారు. పారిశుద్ధ్య పనితీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ఫాగింగ్ ప్రతిరోజు చేయాలని సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సూర్యలంక రోడ్డులో అక్రమణలను పరిశీలించి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో మాట్లాడి వాటిని తొలిగించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీపీవో మల్లికార్జునరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.


అధ్వానంగా ఉన్న డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సునీల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ ఛైర్మన్ పేర్లి సునీల్‌కుమార్

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సునీల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ ఛైర్మన్ పేర్లి సునీల్‌కుమార్ కోరారు. సునీల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో అంతర్జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. డాక్టర్ సాధిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సునీల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థినులు నిబద్ధతతో పని చేసి క్షయవ్యాధిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. హెచ్ఈవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించాలన్నారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించవచ్చునని చెప్పారు. అనంతరం నర్సింగ్ విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మం, మల్లికార్జునరావు, నరేంద్రబాబు, ప్రఫుల్లా, దీప్తి, కార్తీక్, ధనుంజయరావు, మేరి, రత్నాకర్, ఆశా, సుష్మా, వాసంతి, అంజమ్మ, పీఎస్‌కే కాలేజి ఆఫ్ నర్సింగ్ బీఎస్సీ, సుశీల స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న సునీల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ ఛైర్మన్ పేర్లి సునీల్‌కుమార్

ఛలో విజయవాడను జయప్రదం చేయాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరమ్మ

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఈ విషయమై సోమవారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు వినతిపత్రం అందజేసి ఆమె మాట్లాడుతూ సమాజంలో విస్తృతమైన సేవందిస్తున్న ఆశావర్కర్ల సమస్యల పరిష్కార విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 2023 డిసెంబరులో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన ఛలో విజయవాడకు పిలుపునివ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, యూనియన్ నాయకులు కృష్ణవేణి, శిరీషా, మహాలక్ష్మి, ఇందిర, సునీత తదితరులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వరమ్మ, మజుందార్ తదితరులు

ఏజీ కళాశాల పూర్వ విద్యార్థి ఘనత

- వియన్నాలో జరిగే యుఎన్ఓ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం


జాన్ అలెక్స్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : ఆస్ట్రియా రాజధాని వియన్నాలో యుఎన్ఓ సారథ్యంలో జరిగే జీరో ప్రాజెక్టు కాన్ఫరెన్స్‌లో పాల్గొనే అరుదైన అవకాశం బాపట్ల ఏజీ కళాశాల పూర్వ విద్యార్థి జాన్ అలెక్స్‌కు దక్కింది. ఏజీ కళాశాల 1974 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం చెన్నైలోని సీఎస్ఆర్ ఈక్విటాస్ బ్యాంకుకు సీఈవోగా పని చేస్తున్నారు. సామాజిక కార్యక్రమా ల అమలులో తనదైన ముద్ర వేయడంతో ఆయన సేవలను గుర్తించిన యుఎన్ఓ దివ్యాంగులకు సంబంధించి ప్రత్యేకంగా అంధులకు ఉప యోగపడే పరికరాల రూపకల్పనలో జీర ప్రాజెక్టు కాన్ఫరెన్స్-2025ను వియన్నాలో ఈ నెల 5 నుంచి 7 వరకు నిర్వహించదలచింది. దానికి వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి జాన్ అలెక్స్‌కు ఆహ్వానం అందడం ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని పూర్వ విద్యార్థులు సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.



పట్టుబడిన బియ్యంతో అధికారులు అబ్రహం, సురేష్ బాబు

60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మార్టూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయరహదారిపై ఒంగోలు వైపు కోనంకి గ్రామ సమీపంలో వాహనంలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల (60 బస్తాలు) రేషను బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ ఫుడ్ ఇన్స్పెక్టర్ అబ్రహం తెలిపారు. బియ్యంకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవన్నారు. డ్రైవర్ వెంకటేష్, జొన్నలగడ్డ బంగారురాజుపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. బియ్యం బస్తాలను వలపర్లలోని శ్రీలక్ష్మి రైస్‌మిల్లులో ఉంచామన్నారు. ఈ బియ్యం ఎక్కడ నుంచి వస్తున్నాయో తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఈ విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ దాడులలో ఇంకొల్లు డీటీ సురేష్ బాబు కూడా పాల్గొన్నారు.

తమ్మవరం రోడ్డుకు మోక్షం

రూ.1.44 కోట్లతో నిర్మాణానికి అనుమతులు



గుంతలతో అధ్వానంగా ఉన్న తమ్మవరం రోడ్డు

మేదరమెట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి అధ్వానంగా మారిన రోడ్లకు మోక్షం లభించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రయాణానికి కూడా వీలులేకుండా గుంతలతో ఉన్న రోడ్లను గుంతలు పూడ్చి ప్రయాణానికి అనుకూలంగా చేశారు. ప్రభుత్వం కొద్దిగా కుదురుకున్నాకా గ్రామీణ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారు.

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో తమ్మవరం రోడ్డుకు రూ.1.44కోట్ల నిధులు మంజూరు చేయించారు. మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డులో ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తమ్మవరంలో గుండ్లకమ్మ నది వద్దున 20వేల ఎకరాలకు సాగు నీరు అందించే కొరిశపాడు ఎత్తిపోతల పథకం, 4,500 వేల ఎకరాలకు నీరు అందించి తమ్మవరం-2 ఎత్తిపోతల పథకంతో పాటు తమ్మవరం గ్రామంలో 500ఎకరాలకు సాగు నీరు అందించే ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. కొత్తగా నిర్మిస్తున్న ఈథనాల్ ఫ్యాక్టరీ, విండ్ పవర్ తయారీకి అవసరమైన విడి భాగాలను తయారు చేసే పరిశ్రమ ఉంది. వీటి అన్నింటికీ తోడు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు పీడీఎస్ బియ్యం నిల్వచేసే గోడౌన్‌లు ఇక్కడే ఉన్నాయి. కంకర, గ్రావెల్ ఈ ప్రాంతం నుంచే చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా అవుతుంది. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించడం పట్ల మంత్రి రవికుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లగా ఈ రోడ్డుపై ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని ఈ నిధులు మంజూరుతో తమ కష్టాలు తీరనున్నాయని తమ్మవరం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

స్పెల్ బీ విజేత రేణంగివరం బాలికల జట్టు

పంగులూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలస్థాయి స్పెల్లింగ్ బీ పోటీలో రేణంగివరం ప్రాథమికోన్నత పాఠశాల బాలికలు విజేతగా నిలిచారు. మండలంలోని కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో పేర్ని సుబ్బయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 6,7,8 తరగతుల బాల బాలికలకు స్పెల్లింగ్‌బీ పోటీలు నిర్వహించారు. పోటీలో వివిధ పాఠశాలల బా బాలికల జట్లు పాల్గొనగా రేణంగివరం, బూదవాడ, కొండమంజులూరు, చందలూరు జట్లు వరుస స్థానాలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పేర్ని వీరనారాయణ, హెచ్‌ఎం వడ్లమూడి వేణుబాబు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆసక్తి కలిగిన వారికి మహిళా దినోత్సవం సందర్భంగా ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ప్రభుత్వం ఇస్తుందని ఎంపీడీవో కె.కుసుమకుమారి తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు మహిళలు గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90రోజుల పాటు శిక్షణ అందించి మిషన్లు కూడా అందజేస్తారని ఆమె తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ద్వారా ఈ శిక్షణ బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రహ్మణ కులాలకు చెందిన మహిళలకు ఈ శిక్షణ అందిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చినగంజాం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజమాత కాలనీవాసులకు ఇళ్ల పట్టాలి ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సీపీఎం చీరాల ఏరియా కమిటీ నాయకులు జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలను నిర్మించాలని కోరుతూ రాజమాత కాలనీవాసులు తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీవి.రాంప్రసాద్, శ్రీనివాసరావు, రాజమాత కాలనీవాసులు కే.గోపి, చిన్నం ఏసు, కత్తుల శ్రీను, బొజ్జ ఆంజనేయులు, మావెళ్ళ రాము, పెద్దకత్తుల మహాలక్ష్మీ, మెంబరు శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

సూరవరపుపల్లిలో స్ప్రింక్లర్ల పైపులు దగ్ధం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గుంజిపాపారావు ఇంటివద్ద ఉంచిన స్ప్రింక్లర్ల పైపులు దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. వాటిని ఎవరైనా కావాలనే తగులబెట్టారా.. లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనేది తెలియలేదు. అర్ధరాత్రి పెద్దగా మంటలు రావడం స్థానికులు గమనించడంతో పాపారావు కుటుంబసభ్యులు నిద్రలేచి చుట్టుపక్కల వారి సహాయంతో మంటలను ఆర్పివేశారు. పొలాలకు నీళ్ల పెట్టుకోవడానికి గతంలో పాపారావు ఈ పైపులను కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు, మార్చి 3 : (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ఉప్పుటూరు(పర్చూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, వక్తిగత పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులు దరిచేరవని హోమియా వైద్యుడు దాసరి చంద్రశేఖర్ అన్నారు. ఉప్పుటూరు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, అంటువ్యాధులకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న మోటార్‌సైకిల్

అద్దంకి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని మోటార్‌సైకిలిస్టు వెనుక నుంచి ఢీకొనంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండ మండలం పెదకంచర్లకు చెందిన చందోలు విజయరాజు సోమవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వైపు వెళ్తూ నామ్ రోడ్డులో అద్దంకి మండలంలోని మణికేశ్వరం క్రాస్ రోడ్డు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్ర గాయాలైన విజయరాజును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


సారా స్థావరాలపై దాడులు

» ఇద్దరు అరెస్ట్ » 12.50 లీటర్లు స్వాధీనం

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చీరాల ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా వాడరేవుకు చెందిన నాగండ్ల వాసును అదుపులోకి తీసుకుని అతని వద్ద 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే ప్రకాష్ నగర్‌లో దాడులు నిర్వహించి భవనం గోపిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 4.50 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

తప్పిన పెనుప్రమాదం



తగులబడిన గడ్డి

వీరన్నపాలెం (పర్చూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన మంగళవారం మండలం వీరన్నపాలెంలో చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా, నర్సాయపాలెం నుంచి వీరన్నపాలెం వస్తున్న గడ్డి ట్రాక్టర్ స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలోకి రాగానే విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న గడ్డికి అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న గ్రామస్థులు అప్రమత్తమై మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో నివాలు ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పరీక్షలు

మూడు కేంద్రాలలో 833 మందికి

25 మంది ఇంటర్ సెకిండియర్ విద్యార్థులు గైర్హాజర్

అద్దంకిటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుని హాల్‌టికెట్లను పరిశీలించి తమతమ రూములకు చేరుకున్నారు. అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 833 మంది విద్యార్థులకుగాను 808 మంది హాజరుకాగా, 25 మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ ఎం.వీ రాంజనేయులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టంగా పనిచేయండి

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పరీక్షా కేంద్రాల వద్ద సిబ్బంది పటిష్టంగా పని చేయాలని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం చీరాల పరిధిలో జరుగుతున్న ఇంటర్ సెకండియర్ పరీక్ష కేంద్రాలు ఏకేపీ, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలల వద్ద నిర్వహిస్తున్న బందోబస్తును పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు గుర్తు చేశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

మహిళలను గౌరవించాలి

వేటపాలెం (చీరాల), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికు సంబంధించిన వారోత్సవాలు నిర్వహించారు. ఈక్రమంలో సమాజంలో ప్రస్తు తం మహిళల పరిస్థితి, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి నియంత్రణపై అవగాహన కల్పించారు. అలాగే వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు : బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్న విషయాన్ని గుర్తించాలని సీడీపీవో సుభద్ర అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా ఉప్పుటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులతో క్యాండిల్‌తో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక ఎన్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాల, ఆదర్శ స్కూల్‌లో విద్యార్థినులకు సోమవారం వ్యాసరచ న పోటీలను నిర్వహించారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాల పట్ల అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పోలీసు మహిళా సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌తో ప్రయోజనం



సర్టిఫికెట్‌లను ప్రదర్శిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాకల్టీ డెవలప్ మెంట్‌తో విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెరిగి ప్రయోజనకరంగా ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏఐఫర్ నెక్స్ జనరేషన్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వరంగల్ ఈసీఈ బ్రాంచి ప్రొఫెసర్ శ్రీహరిరావు హాజరయ్యారు. ఐదురోజులపాటు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, డా.కిరణ్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల అవగాహనలో వేటపాలెం రైతులు

వేటపాలెం(చీరాల), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో సోమవారం జరిగిన చిరుధాన్యాల అవగాహన కార్యక్రమంలో వేటపాలెం మండలంకు చెందిన 15 మంది హాజరయ్యారు. ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ బాపట్ల వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొనగా, మొత్తం బాపట్ల జిల్లా నుంచి 50 మంది రైతులు హాజరయినట్లు అధికారులు తెలిపారు. అవగాహనలో చిరు ధాన్యాలు వాటి ఆవశ్యకత, విత్తనాల ఎంపిక, వాటి ప్రయోజనాలపై అవగాహన జరిగింది. మంగళవారంతో టూర్ ముగుస్తుందని అధికారులు తెలిపారు.



హైదరాబాద్‌లో జరిగిన చిరుధాన్యాల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వేటపాలెం రైతులు

పారిశ్రామికవేత్తలుగా మహిళలు రాణించాలి

» ఎమ్మెల్యే కొండయ్య
» యూనియన్ బ్యాంకు సహకారంతో రూ.40కోట్ల చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, బ్యాంక్ అధికారులు

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళలు సూక్ష్మ, చిన్న తరహా, పెద్ద తరహా పరిశ్రమల నుంచి పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం పొదుపు సంఘాల మహిళలకు రూ.25కోట్లు, ఎంఎస్ఎంఈకు రూ.9కోట్లు, వ్యాపారులకు రూ.6కోట్ల రుణాలు మంజూరు చేశారు. పేరాల పద్మశాలీయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ముందుగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ తాతా వేణుగోపాల్, రీజనల్ అధికారి రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ పద్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో కూడా పొదపు సంఘాలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. బ్యాంకు సేవలను సక్రమంగా వినియోగించుకోవడం వలన ఆర్థిక స్వాలంబన ఉంటుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా చేనేతలు 79 చేనేత సొసైటీలు ఉండగా, వాటిల్లో 7900 మగ్గాలతో జీవనం గడిపే నిరుపేదలు ఉన్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నిస్సహాయంగా ఉన్నట్లు వివరించారు. అందరినీ గుర్తించి పథకాలతో పాటు, పొదుపు సంఘాల ద్వారా రుణాలు కల్పించి ఆదుకుంటామన్నారు. అలాగే పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు శివకృష్ణ, రామకృష్ణ, హ్యాండ్‌లూమ్ ఏడీ నాగమల్లేశ్వరరావు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్, సీఎంఎం కొండయ్య, ఏపీఎంలు మధు, సుబ్బారావు, మోహన్‌రావు, టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు తదితర పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

తీరిన గవినివారిపాలెం ప్రజల చిరకాల కోరిక

కొన్ని సంవత్సరాలుగా తమ గ్రామంలో బ్యాంకును ఏర్పాటు చేయాలంటూ మండల పరిధిలోని గవినివారిపాలెం వాసులు తిరగని గడప లేదు. ఎక్కని కార్యాలయం మెట్లూ లేవు. ఈక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో ఇటీవల ఒంగోలు బ్యాంకు అధికారులుతో జరిగిన చర్చలు ఫలించాయి. సోమవారం పేరాలలో జరిగిన చెక్కుల పంపిణీ సమయంలో జిల్లా అధికారులు ఏప్రిల్‌లో గవినివారిపాలెం పరిధిలోని కొత్తపాలెంలో బ్రాంచిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్థులు. ఆప్రాంత పొదపు సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చొరవను కొనియాడారు.

దేవతామూర్తుల విగ్రహాలకు స్వాగతం



విగ్రహాలకు కలశాలతో గ్రామంలోకి ఆహ్వానిస్తున్న గ్రామస్థులు(ఇన్‌సెట్‌లో) విగ్రహాలు

మార్టూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో త్వరలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలను సోమవారం గ్రామస్థులు పూలతో,పసుపునీళ్లతో స్వాగతించారు.దేవస్థానంలో ప్రతిష్ఠించేందుకు దేవస్థానం కమిటి సభ్యులు తిరుపతిలో దేవతామూర్తుల విగ్రహాలను తయారుచేయించారు. వాటిలో పంచలోహాలతో వేణుగోపాలస్వామి, సత్యభామాదేవి, రుక్మిణి, విశ్వక్షయనుడి విగ్రహాలను తయారు చేయించారు. అంతేగాకుండా రాతి విగ్రహాలుగా కూడా వేణుగోపాలస్వామి, సత్యభామాదేవి, రుక్మిణితోపాటు ఆంజనేయస్వామి, ద్వారపాలకుల విగ్రహాలను కూడా తయారుచేయించారు. ఆదివారం రాత్రి ఇసుకదర్శి గ్రామానికి తీసుకువచ్చిన దేవతామూర్తుల విగ్రహాలను సోమవారం ఉదయం జాతీయరహదారి ఇసుకదర్శి రోడ్డు నుంచి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. వాటిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరు పై ఊరేగింపుగా తీసుకువస్తూ, గ్రామస్థులు ముఖ్యంగా పురుషులు తలపై కలశాలతో స్వామి వారిని కీర్తిస్తూ, వేదమంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ, మహిళలు రోడ్డుపై నీటితో వార్లు పోస్తుండగా, భక్తి పారవశ్యంతో విగ్రహాలను గ్రామంలోకి స్వాగతించారు. నూతనంగా నిర్మిస్తున్న దేవస్థానం నిర్మాణం పూర్తయిన తర్వాత దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. అప్పటిదాకా దేవతామూర్తుల విగ్రహాలను భద్రంగా ధాన్యాదివాసంలో జాగ్రత్త పరిచారు.

పట్టభద్రుల పోరులో టీడీపీ దూకుడు

(5వ పేజీ తరువాయి)

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను రిట ర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారు. ఎన్నికల నిర్వ హణలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లారు. ఎలక్షన్ షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి కోడ్‌ని పకడ్బం దీగా అమలు చేశారు. రాజకీయ పార్టీల ప్రతి నిధు లు, అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరోవైపు పోలింగ్, ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని నియమించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించారు. ఎక్కడా ఎలాంటి అస్పష్టతకు తావు లేకుండా ఎన్నికలనఉ నిర్వహించారు.

గత ఎన్నికల్లో కంటే ఈ దఫా లక్ష ఓట్లు అధికం గా పోలింగ్ అయ్యాయి. అయినప్పటికీ ఫలితం ముందుగానే వెలువడేలా చేశారు. కౌంటింగ్ హాల్ విశాలంగా ఉండటంతో నాలుగు వరసల్లో ఏడు టేబుళ్ల చొప్పున 28 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయించారు. ఇది ఓట్ల లెక్కింపుని సులభతరం చేసింది.

రిమ్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజి, జీజీహెచ్, నర్సింగ్ కాలేజీలలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగాల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన ప్రకాశం.ఏపీ.జీఓవి.ఇన్/నోటీస్ కేటగిరీ/రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి, విద్యార్హత సర్టిఫికెట్‌లతో జతపరచాలని పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రం... నకిలీ సిత్రం

(5వ పేజీ తరువాయి)

మధ్యలో ఉన్న కొద్ది రోజుల్లో అధికారిక స్టాంపులతో దోచిపెట్టారా! అనేది అర్థంకాని విషయం. సాధారణంగా జగనన్న కాలనీల్లో భూములు ఇవ్వాలంటే పేదలయి ఉండాలి. కానీ ఇక్కడ కొన్ని సంస్థల పేరుపెట్టి కొందరు వ్యక్తులు భూములను నొక్కేశారు. సామాన్యుడికి పట్టణ ప్రాంతాల్లో కేవలం ఒక్క సెంటు భూమి మాత్రమే అప్పటి జగన్ సర్కారు ఇస్తే, వీరు రెండు నుంచి ఐదు సెంట్ల వరకు తీసుకున్నారు. అయితే పేదలకు కేటాయించిన ప్లాట్లలో అయితే ఆధార్ వంటి అన్ని పత్రాలు అప్‌లోడ్ చెయ్యాల్సిన పరిస్థితి ఉండటం, సంస్థలకు వీటిలో ఇచ్చే అవకాశం లేకపోవటంతో ఒక్కో కాలనీలో ఇళ్లు కేటాయించిన లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలు, పార్క్, ఆట స్థలాల వంటివాటి కోసం కేటాయించిన కమ్యునల్ స్థలాలను టార్గెట్‌గా చేసుకుని వాటిని ఈ నకిలీ పత్రాలతో ఆక్రమించేశారు.

ధ్రువీకరణ పత్రాలతో పన్నుల చెల్లింపు

ఒక భూమిపై హక్కు పొందాలంటే ప్రభుత్వం అధికారికంగా అందించిన పట్టా ఉండాలి. లేక నివేశన స్థల ధృవపత్రం కానీ, పట్టా కానీ ఉండాలి. కానీ ఇక్కడ నకిలీ ధృవీకరణ పత్రాలు పుట్టుకొచ్చాయి. పెదరావూరు లేఔట్‌లో కమ్యునల్ స్థలాన్ని ఆక్రమించి ఉండటం గుర్తించిన రెవెన్యూ అధికారులు వారిదగ్గరున్న పట్టాను చూపాలని కోరటం, రెండు ప్రయివేటు సంఘాల పేరుతో స్థలాలు పొందినట్టు ధృవపత్రాలు చూపటంతో వాటిని పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. అయితే ఇదే తరహాలో తాజాగా ఒక ప్రయివేటు స్థలానికి, మండల పరిధిలోని మరికొన్ని ప్రభుత్వ స్థలాలకు ఇదేతరహా పత్రాలను చూపి పన్నులు చెల్లించనట్టు సమాచారం అందటంతో అధికారులు వీటిపై దృష్టిపెట్టారు. మండలంలో ఎక్కడెక్కడ ఎంత మేర ప్రభుత్వ భూములను ఆక్రమించారో తెలుసుకునే పనిలో పడ్డారు.

ఇంతటి వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా జరిగే అవకాశం తక్కువ. అయితే దీనికి సహకరించింది ఎవరు? ఇంకా ఎంతమందికి! ఎన్ని రూ. కోట్ల విలువైన స్థలాలను అప్పగించేశారనేది తేలాల్సిఉంది. దీనిపై వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. అధికారికంగా చెప్పకున్నా, ఈ నకిలీల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారని మాత్రం సమాచారం.